నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
15 | హైదరాబాద్, మంగళవారం 12 మార్చి 2024 | RANGAREDDY

## ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

ఇబ్రహీంపట్నం, మార్చి 11 : ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో గతకొన్ని రోజులుగా అవిశ్వాస పరంపర కొనసాగుతున్నది. మొన్నటి వరకు చైర్‌పర్సన్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. కౌన్సిలర్లు నెల రోజులపాటు క్యాంపులకు వెళ్లారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టించడంలో వైస్ చైర్‌పర్సన్ కీలక పాత్ర పోషించారు. దీంతో ఆమెపై కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కౌన్సిలర్లు సోమవారం కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మాన పత్రాన్ని అందించారు. తీర్మాన పత్రంపై సంతకాలు చేసిన వారిలో కౌన్సిలర్లు నీళ్ల భానుబాబుగౌడ్, బర్తాకి జగన్నాథం, యాచారం సుజాత, మంద సుధాకర్, సుల్తాన్, పంది శంకరయ్య, ఆకుల మమత, ఈర్లపల్లి సునీత, నరాల విశాల, ఇందిరాల రమేశ్, సుల్తానాబేగం, బర్ల మంగ, కప్పరి స్రవంతి, నీలం శ్వేత, జెర్కోని బాలరాజులు ఉన్నారు. మళ్లీ కౌన్సిలర్లంతా క్యాంపులకు వెళ్లే అవకాశం ఉన్నది.

# చేవెళ్లలో.. చెయ్యిచ్చేదెవరికో!

**కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ప్రకటనపై కొనసాగుతున్న సస్పెన్స్**

**పట్నం సునీతామహేందర్‌రెడ్డికి టికెట్ కేటాయింపుపై హైడ్రామా**

**అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన నేతలకు చాన్స్ ఇవ్వొద్దని ఇప్పటికే కాంగ్రెస్ నిర్ణయం**

**ఈ పరిస్థితుల్లో కేఎల్ ఆర్‌కు అవకాశం చేజారినట్లేనా!**

**చర్చనీయాంశంగా మారిన చేవెళ్ల కాంగ్రెస్ సమావేశం**

రంగారెడ్డి, మార్చి 11(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి విషయంలో హైడ్రామా నడుస్తున్నది. పార్టీ నాయకత్వం హామీ ఇచ్చిందంటూ పట్నం సునీతామహేందర్‌రెడ్డి భరోసాగా ఉండగా.. మరోవైపు కాంగ్రెస్ సీనియ ర్ నాయకుడు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఎంపీ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రకటించిన మొదటి జాబితాలోనే సునీతారెడ్డి పేరు ఉంటుందని అంతా భావించినా అధిష్ఠానం మాత్రం అభ్యర్థి ప్రకటనను వాయిదా వేస్తూ వ స్తున్నది. ఈ నేపథ్యంలోనే సోమవారం చేవెళ్లలో నిర్వహించిన కాంగ్రెస్ సమావేశం ప్రాధాన్యతను సంతరించుకున్నది. పట్నం సునీతారెడ్డి, ఇతర కీలక నేతలు హాజరవ్వడంతోపాటు అందులో సునీతారెడ్డి అభ్యర్థిత్వానికి మద్దతునిస్తూ నేత లు మాట్లాడడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పేరుకు కార్యకర్తల విస్తృతస్థాయి మీటింగ్ అయినప్పటికీ.. బలనిరూపణ కోసమేనన్న ప్రచారం జరుగుతున్నది. పార్లమెంట్ ఎన్నికలను కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం.. అభ్యర్థి ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తుండడంతో పట్నం వర్గీయుల్లో ఒకింత టెన్షన్ నెలకొన్నది.

**రోజుకో మలుపు..!**

ఎంపీ స్థానాల్లో బలమైన అభ్యర్థులను బరిలో దించేందుకు కాంగ్రెస్ వ్యూహాలు రచిస్తున్నది. చేవెళ్ల నుంచి బరిలో నిలిచేందుకు బలమైన నాయకులు లేకపోవడంతో ఇటీవల వికారాబాద్ జడ్పీచైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. కొద్దిరోజుల క్రితం చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన భారీ సభావేదికపైనే సీఎం రేవంత్‌రెడ్డి సునీతారెడ్డి పేరును ప్రకటిస్తారని అంద రూ భావించినా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. తాజాగా కాంగ్రెస్ పార్టీ నాలుగు ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. అందులో చేవెళ్ల అభ్యర్థిగా ఆమె పేరు ఉంటుందని ప్రచారం జరిగినా తొలి జాబితాలో చోటు దక్కలేదు. సునీతారె డ్డి అభ్యర్థిత్వం విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం యూటర్న్ తీసుకుందన్న ప్రచా రం నేపథ్యంలో కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేరు తెరపైకి వచ్చింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం నుంచి పోటీచేసి ఓడిపోయిన కేఎల్ఆర్ పేరు కాంగ్రెస్ పెద్దల పరిశీలనలో ఉందన్న ప్రచారం జరుగుతున్నది. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన నేతలకు చాన్స్ ఇవ్వొద్దని ఇప్పటికే అధిష్ఠానం ఓ నిర్ణయానికి వచ్చిన నేపథ్యంలో కేఎల్ఆర్‌కు అవకాశం వస్తుందా.? అన్నది ఆసక్తికరంగా మారింది. చేవెళ్ల రాజకీయాలు రోజుకోమలుపు తిరుగుతున్న నేపథ్యంలో వీరిద్దరు కాకుండా మరో అభ్యర్థిని కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించినా..ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్న టాక్ కూడా నడుస్తున్నది.

**చేవెళ్ల సమావేశంపై సర్వత్రా చర్చ..**

ఒకటి, రెండు రోజుల్లో కాంగ్రెస్ అధిష్ఠానం రెండో జాబితాలో ఎంపీ అభ్యర్థులను ప్రకటిస్తారన్న ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలోనే చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన కార్యకర్తల సమావేశం ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. ఈ మీటింగ్‌కు పట్నం సునీతామహేందర్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి, వి కారాబాద్ జిల్లాల అధ్యక్షులు నర్సింహారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి హాజరయ్యారు. చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్, నవాబుపేట, శంకర్‌పల్లి మండలాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివచ్చారు. సీనియర్ నేతలు ఆహ్వానిస్తేనే కాంగ్రెస్‌లో చేరానని ఈ సందర్భంగా సునీతారెడ్డి స్పష్టం చేయగా..ఆమె గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల డివిజన్ ఇన్‌చార్జి భరత్‌తోపాటు పలువురు నేతలు పిలుపునిచ్చారు. విస్తృతస్థాయి సమావేశమని నేతలు చెబుతున్నా.. పార్టీ నాయకత్వం అంతా సునీతకు మద్దతుగా ఉందని చాటి చెప్పేందుకే ఈ మీటింగ్ నిర్వహించారన్న టాక్ బాహాటంగా వినిపిస్తున్నది. సునీతారెడ్డి అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ ఈ వేదిక నుంచి పార్టీ అధిష్ఠానానికి ఓ సంకేతం ఇచ్చినట్లైందన్న చర్చ సైతం పార్టీ వర్గాల్లో జరుగుతున్నది. ఈ స్థానం నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూ పుతున్న ఓ నేత నేడో, రేపో కాంగ్రెస్‌లో చేరుతారన్న ప్రచారం నేపథ్యంలోనే ఈ మీటింగ్‌ను నిర్వహించారని సమాచారం. ఏదిఏమైనా చేవెళ్ల ఎంపీగా పోటీ చేసే చాన్స్ ఆ పార్టీ అధిష్ఠానం ఎవరికి ఇస్తుందో! తేలాలంటే మరికొద్ది రోజులు వేచి చూడాల్సిందే.

చేవెళ్లలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీచైర్‌పర్సన్ సునీతారెడ్డి

# తాండూరు కాంగ్రెస్‌లో.. తలోదారి

**మూడు గ్రూపులుగా వీడిపోయిన హస్తం పార్టీ**

- ఓవైపు పట్నం ఫ్యామిలీ.. మరోవైపు ఎమ్మెల్యే.. ఇంకోవైపు ఎమ్మెల్యే సోదరుడి గ్రూపులు
- ఇరకాటంలో పడిన తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- 'పట్నం'కు పోటీగా ఎమ్మెల్యే సోదరుడి ఎత్తులు
- రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పట్నం ఫ్యామిలీకే టికెట్ అంటూ ప్రచారం షురూ
- మనోహర్‌రెడ్డికి తలనొప్పిగా మారిన వర్గపోరు



వికారాబాద్, మార్చి 11 (నమస్తే తెలంగాణ): తాండూరు కాంగ్రెస్‌లో ఆధిపత్య పోరు మొదలైంది. మూడు వర్గాలుగా వీడిపోయిన నాయకులు ఎవరికి వారు పైచేయి సాధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అనూహ్యంగా తాండూరు నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్ పొంది ఎమ్మెల్యేగా గెలిచిన బుయ్యని మనోహర్‌రెడ్డి....పట్నం ఫ్యామిలీ హస్తం పార్టీలో చేరడంతో ఇరకాటంలో పడ్డారు. దీంతో ఈ సెగ్మెంట్‌లో ఆ పార్టీ మూడు గ్రూపులుగా విడిపోయింది. ఓ వైపు ఎమ్మెల్యే వర్గం.. మరోవైపు పట్నం ఫ్యామిలీ.. ఎమ్మెల్యే సోదరుడు వర్గాలుగా విడిపోయి ఎవరికి వారు పైచేయి సాధించేందుకు ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నా రు. తాండూరు ఎమ్మెల్యేగా మనోహర్‌రెడ్డి విజయం సాధించిన మూడు నెలలకే వర్గపోరు మొదలు కావడంతో ఆయన అసంతృప్తిగా ఉన్నట్లు తాండూరు కాంగ్రెస్‌లో చర్చ జరుగుతున్నది. అంతేకాకుండా ఎమ్మెల్యే ఇంట్లోనూ రచ్చ మొదలయ్యిందనే ప్రచారం జోరుగా సాగుతున్నది. ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడిన మనోహర్‌రెడ్డి సోదరుడు శ్రీనివాస్‌రెడ్డి ఎంపీ టికెట్ తనకే అంటూ ప్రచారం చేసుకుంటే.. ఆయనకు ఎమ్మెల్యే సహకరించడం లేదని... ఎడమొహం, పెడమొహంగా ఉంటున్నట్లు తాండూరులో చర్చ జరుగుతున్నది. అంతేకాకుండా ఇసుక దందాతోపాటు ఇతరత్రా విషయాల్లోనూ సోదరుడు నేరుగా తలదూర్చుతుండడంతో ఎమ్మెల్యే ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఉన్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతున్నది. ఈ సెగ్మెంట్‌లోని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏ వర్గం వైపు ఉండాలో తెలియని అయోమయం నెలకొన్నది.

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పట్నం ఫ్యామిలీకే ఎమ్మెల్యే టికెట్ అంటూ ఇప్పుడే ప్రచారం షురూ కావడంతో మనోహర్‌రెడ్డికి ఎమ్మెల్యేగా గెలిచిన సంతోషం మూణ్నాళ్ల ముచ్చటగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

**పైచేయి సాధించేందుకు ప్రయత్నాలు..**

తాండూరు కాంగ్రెస్‌లో పైచేయి సాధించేందుకు మూడు వర్గాల నాయకులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. క్యాడర్ మూడు గ్రూపులుగా చీలిపోవడంతో గ్రూ పు రాజకీయాలు మొదలయ్యాయి. ఇసుక దందా మొదలుకొని అధికారుల వద్ద పెత్తనం వరకు అన్నింటిలోనూ ఎవరికి వారు తమ మాటే నెగ్గేలా చూసుకుంటున్నారు. ఓ వైపు ఎమ్మెల్యే సోదరుడు పార్టీలో సెపరేట్ కుంపటి పెట్టి తలనొప్పిగా మారగా.. పట్నం ఫ్యామిలీ కాంగ్రెస్‌లో చేరడంతో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి సంకట పరిస్థితి నెలకొన్నది. ఎమ్మెల్యే వర్గం, పట్నం ఫ్యామిలీ, ఎమ్మె ల్యే సోదరుడి వర్గంలో ఎవరి మాట వినాలో తెలియక అధికారుల్లోనూ అయోమయ పరిస్థితి నెలకొన్నది. ఓ వర్గం వారి మాట వింటే మిగిలిన ఇరువర్గాల వారు ఇబ్బందులకు గురి చేస్తారని ఆందోళన చెందుతున్నారు. ఇటీవల జరిగిన పోలీసు, ఇతరత్రా పోస్టింగ్‌ల్లోనూ తమకు నచ్చిన వారికి పోస్టింగ్‌లు ఇప్పించేందుకు మూడు వర్గాల నాయకులు తీవ్రంగా ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది.

అయితే తాండూరులో కొన్నేండ్లుగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సోదరుడు శ్రీనివాస్‌రెడ్డి వ్యాపారం చేస్తుండడంతో స్థానికంగా ఉన్న పరిచయాలతో ఎమ్మెల్యే కంటే ఆయన వద్దకే పంచాయితీలు వెళ్తున్నట్లు తెలుస్తున్నది. అంతేకాకుండా తాండూ రు కాంగ్రెస్‌లో ఆయన సోదరుడు యాక్టివ్ రోల్ పోషిస్తున్నట్లు.. సగానికిపైగా క్యాడర్ అతడి వైపే ఉండడంతో ఇష్టం లేకున్నా సోదరుడి మాట ప్రకారమే మనోహర్‌రెడ్డి ముందుకెళ్తున్నాడనే అభిప్రాయమూ వ్యక్తమవుతున్నది.

మరోవైపు పట్నం మహేందర్‌రెడ్డి కుటుంబం ఇటీవల కాంగ్రెస్‌లో చేరడంతో ఇద్దరు సోదరుల మధ్య మరింత నిప్పు రాజుకున్నట్లు సమాచారం. పట్నం ఫ్యామిలీకి తాండూరు సెగ్మెంట్‌లో పట్టుతోపాటు ప్రత్యేక క్యాడర్ ఉండడంతో ఇకపై ఇక్కడ పెత్తనమంతా ఆ కుటుంబం చేతుల్లోకే వెళ్తుందనే ఆందోళన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, సోదరుడు శ్రీనివాస్‌రెడ్డి వర్గాల్లో నెలకొన్నది. ఎట్టిపరిస్థితుల్లోనూ పట్నం కుటుంబానికి సన్నిహితంగా ఉండే వారికి పార్టీలో ప్రాధాన్యమివ్వొద్దని ఎమ్మెల్యేకు ఆయన వర్గం నాయకులతోపాటు సోదరుడు పదేపదే ప్రస్తావిస్తున్నట్లు తెలుస్తున్నది. తమకు కాకుండా పట్నం వర్గానికి అధిక ప్రాధాన్యమిస్తే మా దారి మేము చూసుకుంటామంటూ ఎమ్మెల్యే గెలుపు కోసం పనిచేసిన ముఖ్యనాయకులు, అనుచరులు మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

**రానున్న ఎన్నికల్లో పట్నం ఫ్యామిలీకే టికెట్ అంటూ ప్రచారం..**

తాండూరు ఎమ్మెల్యేగా మనోహర్‌రెడ్డి గెలుపొంది నాలుగు నెలలు కూడా పూర్తి కాకుండానే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరు టికెట్ పట్నం ఫ్యామిలీకే అంటూ ప్రచారం షురూ అయ్యింది. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పట్నం మహేందర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ నుంచి తాండూరు టికెట్ ఆశించగా, సిట్టింగ్ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డికి టికెట్ ఇచ్చి మహేందర్‌రెడ్డిని అధిష్ఠానం బుజ్జగించింది. అయితే పట్నం ఫ్యామిలీ ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరింది. సెగ్మెంట్‌లో తనకంటూ ప్రత్యేక క్యాడర్‌ను కలిగి ఉన్న పట్నం మహేందర్‌రెడ్డి రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన లేదా కుటుంబ సభ్యులు తాండూరు నుంచి పోటీ చేస్తారనే ప్రచారం జోరుగా జరుగుతున్నట్లు సమాచారం. ఈ ప్రచారాన్ని తిప్పికొట్టలేక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వర్గం అయోమయంలో పడిపోయింది. అంతేకాకుండా పట్నం ఫ్యామిలీ కాంగ్రెస్‌లో చేరిన తర్వాత ఎమ్మెల్యే వర్గానికి చెందిన నాయకులు ఆ వర్గంలో చేరుతున్నట్లు తెలుస్తున్నది. ఓ వైపు సోదరుడి రచ్చ, మరోవైపు పట్నం ఫ్యామిలీ పెత్తనంతో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి తలనొప్పిగా మారింది.

# 'హరిత' విప్లవమేది!

- ఈ ఏడాది హరితహారం లక్ష్యం 25లక్షలకు కుదింపు
- గత ప్రభుత్వంలో ప్రతి యేటా 70-80లక్షల మొక్కల నాటింపు
- స్థలాలు లేవన్న కారణంతో టార్గెట్ తగ్గిందంటున్న అధికారులు

శంకర్‌పల్లి మండలంలోని మాసనిగూడ రోడ్డు వెంట ఎండిన మొక్కలు

శంకర్‌పల్లి మండలంలోని కచ్చిరెడ్డిగూడ రోడ్డు వెంట దగ్ధమైన మొక్కలు

రంగారెడ్డి, మార్చి 11 (నమస్తే తెలంగాణ) : హరిత లక్ష్యం ఖరారైంది. 2024 లో రంగారెడ్డి జిల్లాలో 25 లక్షల మొక్కలను నాటాలని నిర్ణయించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతి యేటా 70-80 లక్షల వరకు మొక్కలను నాటించేలా వివిధ శాఖలు చర్యలు చేపట్టాయి. ఈ లెక్కన గత తొమ్మిదేండ్ల కాలంలో జిల్లావ్యా ప్తంగా 8.27 కోట్ల మొక్కలను నాటారు. గత ప్రభుత్వం హరితహారానికి ఎంతో ప్రాధాన్యత ఇవ్వగా.. ఈసారి ఆ కార్యక్రమానికి ప్రాధాన్యత తగ్గించడం చర్చ నీయాంశంగా మారింది. మొక్కలను నాటేందుకు స్థలాలు లేవని కొన్ని శాఖలు చేతులెత్తేయడంతో టార్గెట్ తగ్గింది. ఎండలు మండుతున్న తరుణంలో నర్సరీల్లో మొక్కల సంరక్షణ సైతం అధికారులకు పెను సవాల్‌గా మారింది.

**హరితహారానికి ఆ శాఖలు దూరం..!**

ప్రతి ఏటా గ్రామీణాభివృద్ధి శాఖ, అటవీ శాఖలు సంయుక్తంగా హరిత లక్ష్యాన్ని నిర్ణయిస్తాయి. వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించి ఏ యే శాఖలు ఎంత మేర మొక్కలు నాటాల్సి ఉంటుందో.. నిర్ణయం తీసుకుంటారు. ఈ ఏడాది హరితహారం టార్గెట్ కోసం నిర్వహించిన సమావేశంలో చాలా వరకు శాఖల ఆఫీసర్లు మొక్కలు నాటేందుకు నిరాసక్తత చూపారు. ఇందుకు స్థలాలు లేవన్న కారణాన్ని చూపించారు. దీంతో ఈ ఏడాది హరితహారం లక్ష్యాన్ని కేవ లం 25 లక్షల మొక్కలకే పరిమితం చేశారు. 2025లో 23 లక్షలు, 2026లో 22 లక్షల మొక్కలను నాటేలా మూడేండ్ల లక్ష్యాన్ని నిర్దేశించారు. కేసీఆర్ ప్రభు త్వంలో ఒక ఏడాదిలోనే కోటి మొక్కలను నాటిన సందర్భాలున్నాయి. కానీ.. కొత్త ప్రభుత్వంలో మూడేండ్ల టార్గెట్ మొత్తం కలిపి 80 లక్షలు కూడా దాట కపోవడం గమనార్హం. గతంలో అన్ని ప్రభుత్వ శాఖలు భాగస్వామ్యమై హరి తహారాన్ని సక్సెస్ ఫుల్ చేశాయి. అయితే..ఈసారి డీపీవో, వ్యవసాయ, ఇరిగే షన్, ఎక్సైజ్, హెల్త్, హార్టికల్చర్, ఎండోమెంట్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, మైన్స్, మార్కెటింగ్, సివిల్ సప్లయ్ శాఖలకు టార్గెట్స్ లేకపోవడంతో ఆయా శాఖలు హరితహారం కార్యక్రమానికి దూరంగా ఉండనున్నాయి.

**సవాల్‌గా మొక్కల సంరక్షణ ..**

జిల్లాలోని 558 గ్రామ పంచాయతీల్లో..పంచాయతీకో నర్సరీని ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల కారణంగా మొక్కల పెంపకం ప్రక్రియ ఈసారి ఆలస్యమైనది. కొన్ని నర్సరీల్లో మొక్కలు కొంత మేర పెరగగా.. మరికొన్ని చోట్ల ప్లాస్టిక్ కవర్లలో మట్టిని నింపి మొక్కలు నాటే పనులు జరుగుతు న్నాయి. వర్షాకాల ప్రారంభం అంటే జూన్ నెల వరకు మొక్కలు పెరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో మొక్కలను సంరక్షించడం అధికారులకు సవాల్‌గా మారింది. ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండడంతో బోర్లలో నీటి మట్టాలు తగ్గి మొక్కలకు నీళ్లు అందడంలేదు. పలు చోట్ల పంచాయతీ ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తూ మొ క్కలను సంరక్షిస్తున్నారు. గ్రీన్ నెట్లు లేకపోవడం.. ఇతరత్రా కారణాలతో అక్క డక్కడా నర్సరీల్లో మొక్కలు ఎండిపోతుండడంతో వాటి స్థానంలో మళ్లీ విత్తనాల ను నాటే ప్రక్రియను చేపడుతున్నారు.

**2024లో హరితహారం లక్ష్యం ఇలా..**

| శాఖ | టార్గెట్ |
|---|---|
| డీఆర్డీవో | 15,00,000 |
| మున్సిపాలిటీలు | 6,00,000 |
| అటవీ శాఖ | 3,00000 |
| పరిశ్రమల శాఖ | 1000 |
| విద్యాశాఖ | 500 |
| మొత్తం | 25,500,00 |

**కేసీఆర్ ప్రభుత్వంలో మొక్కలు ఇలా..**

| సంవత్సరం | నాటిన మొక్కలు(లక్షల్లో) |
|---|---|
| 2015 | 73.78 |
| 2016 | 139.24 |
| 2017 | 71.041 |
| 2018 | 86.12 |
| 2019 | 105.429 |
| 2020 | 102.745 |
| 2021 | 89.248 |
| 2022 | 77.100 |
| 2023 | 82.418 |
| మొత్తం | 8 కోట్ల 27 లక్షల పై చిలుకు |

శంకర్‌పల్లి మండలంలోని కొత్తపల్లి నర్సరీలో ఎండిన మొక్కలు

# పదో తరగతి పరీక్షలు సజావుగా నిర్వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, మార్చి 11(నమస్తే తెలంగాణ) : పదో తరగతి పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. సోమవారం రాజేంద్రగర్ ఆర్డీవో కార్యాలయంలో పదో తరగతి పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరిగే పదో తరగతి పరీక్షలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. జిల్లాలో 237 పరీక్షాకేంద్రాల్లో 50,946 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రశ్నాపత్రాలను భద్రపర్చేందుకు 37 పోలీస్ స్టేషన్ల గుర్తించడం జరిగిందన్నారు. కేంద్రాల్లోకి మొబైల్స్, వాచ్స్, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించకూడదన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలోనూ మొబైల్ డెస్క్ ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ విధించి పోలీసు బందోబస్తు నిర్వహించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసి వేయించాలన్నారు. కేంద్రాల వద్ద అత్యవసర మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఆశ వర్కర్, ఏఎన్ఎంలను ఇతర సిబ్బందిని నియమించాలని వైద్యాధికారికి సూచించారు. ఫర్నిచర్ , తాగునీరు, విద్యుత్తు సౌకర్యం, టాయిలెట్లు, ఫ్యాన్లు ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష సమయాలను దృష్టిలో పెట్టుకొని బస్సులను నడిపించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు సరైన సమయంలో చేరుకునేలా ఉదయం పరీక్షకు గంట ముందు బస్సులు నడపాలని, పరీక్ష రాసిన తర్వాత ఇండ్లకు చేరుకునేలా బస్సులు నడపాలని సూచించారు. విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని ట్రాన్స్ కో అధికారులను ఆదేశించారు. నిర్ణీత సమయానికి సకాలంలో ప్రశ్నాపత్రాలు కేంద్రాలకు చేరాలన్నారు. పరీక్షలు ప్రారంభమయ్యే సమయానికి ముందే విద్యార్థులు తమకు కేటాయించబడిన పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎప్పటికప్పుడు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసేందుకు వీలుగా ఫ్లైయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్లను నియమించినట్లు పేర్కొన్నారు. మాస్ కాపీయింగ్ జరుగకుండా ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్‌లు చూడాలని, బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో మహిళా కానిస్టేబుల్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రతిమా సింగ్, భూపాల్ రెడ్డి, డీఆర్‌వో సంగీత, జిల్లా విద్యా శాఖ అధికారి సుశీందర్‌రావు, పోలీసు అధికారులు, ఆరోగ్య, ఆర్టీసీ శాఖల అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పంచాయతీ బిల్డింగ్‌ల నిర్మాణాలు పూర్తి చేయండి

**అధికారులకు వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం**

వికారాబాద్, మార్చి 11 : జిల్లాలోని పలు గ్రామాల్లోని పంచాయతీ బిల్డింగ్‌ల నిర్మాణ పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. సోమ వారం టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లా లో జరిగే అభివృద్ధి నిర్మాణ పనుల్లో గ్రామ పంచాయతీ బిల్డింగ్ లేకుండా గ్రామ పంచాయతీలు ఉండకూడదన్నారు. నిర్మాణ పనుల్లో జాప్యం జరుగకుండా ప్రతి రోజూ జరగాల్సిన పనులకు ఎన్ని మిల్లర్లు, ఎంత మంది లేబర్ అవసరమో అంచనాలు వేసుకుని పనులను పూర్తి చేయాలన్నారు. మండలంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ఎక్కడ కూడా ఆగకుండా చేయాలని, ప్రతి గ్రామపంచాయతీ బిల్డింగ్స్, స్కూల్స్ ప్రహరీలు, కిచెన్ షెడ్ల నిర్మాణాలను ముందే ప్రారంభించి పూర్తి చేసి, వివరాలను ఎఫ్‌టీవో జనరేట్ చేయాలన్నారు. ఈ నెల 15 వరకు కచ్చితంగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో సీసీ రోడ్లకు మంజూరైన నిధులతో అంచనాలను రూపొందించుకుంటూ పనుల్లో వేగం పెంచాలన్నారు. ఈ సందర్భంగా మండలాల వారీగా నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. టెలికాన్ఫరెన్స్‌లో పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌లు, డీఈలు, ఈఈలు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.